# సప్తగిరిధామ
# కలియుగసార్వభౌమ!



రచన

డా॥ రాళ్లబండి కవితాప్రసాద్

# సప్తగిరిధామ
# కలియుగసార్వభౌమ!

రచన

డా॥ రాళ్లబండి కవితాప్రసాద్



‘సప్తగిరిధామ కలియుగసార్వభౌమ’ (పద్యశతకము) H రచన : డా॥ రాళ్లబండి కవితాప్రసాద్ H ప్రథమ ముద్రణ జనవరి, **2011** ; H ప్రతులు : **1000** H వెల : రూ. **100/-** H ప్రతులకు : © డా. రాళ్లబండి కవితాప్రసాద్, ఫ్లాట్ నెం.**203**, టింబు ఎన్‌క్లేవ్, మోతీనగర్ – ఎర్రగడ్డ, హైదరాబాద్–**500 018**. ఆం.ప్ర. ఫోన్ : **040–23835748, 9949492626** **E-mail : kavithaprasadrv@yahoo.com** H డిటిపి : సమంత గ్రాఫిక్స్, ఎస్.ఆర్.టి.**8**, జవహర్‌నగర్, హైదరాబాదు – **500 020**. ఫోన్ : **27670198**

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆంధ్రాచార్యులు
**డా॥ శలాక రఘునాథ శర్మ** "జ్ఞానపూర్ణిమ" 78-10-5/2,
సి-3, రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్, శ్యామలానగర్,
రాజమండ్రి - 533 103, 0883-2432906

# సహృదయ స్పందన

తెలుగు వాఙ్మయంలో జనహృదయాలను రససాగరంలో ముంచి యెత్తినవి శతకాలు. శతకాలలో శేషప్పకవి రచించిన నరసింహ శతకమూ, కాసుల పురుషోత్తమ కవి రచించిన ఆంధ్రనాయక శతకమూ ఒకప్పుడు తెలుగునోళ్లలో నిరంతరంగా ఆడుతూ ఉండేవి. వాని వాఙ్మయశక్తి అనితరసాధ్యమైనది. మళ్లీ చాలా కాలానికి ఆ కోవలో సుస్థిరస్థానం సంపాదించుకోగల శతకం ఒకటి ఇప్పుడు ఆవిర్భవించింది. అది డా॥ రాళ్లబండి కవితాప్రసాదరాయకవి రచించిన -

"ప్రణవ సుమదామ! నిగమపరాగసీమ!
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ". మకుటంతో ఏర్పడిన శతకం.

'ఈ పద్యాలు ఈ కవివి' అని ప్రకటించక పోతే ఇవి శేషప్ప, పురుషోత్తమ కవుల కమనీయ పద్యాలే అని తద్‌జ్ఞులు అనుకొనే తీరు తెన్నులలో ఉన్నాయి.

నేను వీనిని అనుశీలిస్తున్నప్పుడు నాకు కలిగిన అనుభూతికి అక్షరాకృతిని కల్పించవలసివస్తే 'ఇవి ఆయన పలికినవి కావు. శ్రీ వేంకటాచలపతి స్వయంగా పలికించినవి' అన్న స్ఫురణ కలిగింది.

ఇది ఒక 'కవితారూపతపస్సు'. స్వామినీ, స్వామి పరిసరాలనూ, స్వామి సామ్రాజ్యాన్నీ దర్శించిన కవి హృదయం పారవశ్యంతో వెలికి తన్నుకొనిరాగా ఈ శతకం రూపొందినది. జగత్తునూ, జగదధీశ్వరునీ ఇటు కొంచెం, అటు కొంచెంగా అనుశీలించుకుంటూ పోగా కలిగిన దర్శనానికి



వర్ణనరూపమే ఈ శతకం. ఇందులో గీత చెప్పిన ఆర్తి, జిజ్ఞాస, అర్థార్థిత్వమూ, జ్ఞానమూ నాలుగూ గోచరిస్తాయి. ఆ నాలుగింటినీ సుకృతియై మథించిన కవి హృదయపుబుగ్గ నుండి ఉవ్వెత్తుగా పొంగివచ్చిన రసవాహినియే ఈ శతకం.

రచయితగా కవినీ, పఠితగా సహృదయుని రసవీథివిహారం చేయించ టంలో దీనికి నిండైన సామర్థ్యం ఉన్నది. రెండు మెతుకులు పట్టి చూద్దాం.

తనువుకుండను పాలమనసును పొంగించి
ఆలోచనలవేడి నారనిచ్చి,
పాడియౌ గురుభక్తి తోడుచుక్కగవేసి
గుట్టుగా తపమున కూడపెట్టి
కుండలిన్ పెనుచుట్ట కుదురుగా నిలబెట్టి
ఆత్మరజ్జువు దెచ్చి అంటగట్టి
మంత్రపుకవ్వాన మంథనంబొనరించి
పరతత్త్వమను వెన్నపాత్ర నింపి

నీకు నైవేద్యమిదు నవనీత మిదిగొ
రమ్ము కొనవయ్య! బ్రతుకుసారమ్మిదయ్య!
ప్రణవసుమదామ! నిగమపరాగసీమ!
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ!

ఎంత కమనీయ భావన! ఎంత గంభీరభావన! ఎంత పరిణత వేదాంత తత్త్వసంభావన! మొత్తం సీసపాదాలలో ఏడు అసమాపక క్రియలున్నాయి. అవి ఏడూ ఏడు కొండలను స్మరణకు తెస్తాయి. ఎనిమిదవది పరతత్త్వమనే వెన్న. అది కలియుగ సార్వభౌమునికి సంకేతం. మొత్తం బ్రతుకు సారాన్ని నవనీతంగా చేసి నైవేద్యం పెట్టటమనే ఆత్మసమర్పణ ఎంత కవితామయంగా కుదురుకున్నదీ! అందుకే అన్నాను ఇది 'విశ్వనాథ' సంభావించిన

'కవితారూపతపస్సు' అని. ఇటువంటి పద్యాలే శేషప్ప, పురుషోత్తమకవుల సరసన ఈ కవిని నిలబెట్టగలుగుతాయి. నిజానికి వంద అక్కరలేదు. ఇటవంటి పద్యం ఒక్కటి చాలు. కానీ వందకు పైన పద్యాలూ ఇలానే ఉన్నాయి.

వేయికన్నుల వానికే యగమ్యము తాను
    నీరూపతతులు ననేకమాయె
రెండువేలరసన లుండెడివాడైన
    కొంతైన చెప్పలేకుండెనాయె
వాడిమయూఖాల జ్వాలాధిపతియైన
    నీపాదములచిన్న దీపమాయె
ముక్కోటిదేవతామూర్తులమకుటాలు
    నీ కాలిగోళ్ల సందీప్తులాయె

ఊహ కందని విశ్వవిద్యుత్తు వీవు
దేహగుహలోన తిరిగెడు ఊహ నేను
ప్రణవసుమదామ! నిగమపరాగసీమ!
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ!

ఇందులో ఒక చమత్కారం చక్కగా గోచరిస్తున్నది. పరమాత్మ నిజానికి నిరాకారుడు. కాని ఉపాసకుల కార్యార్థం బ్రహ్మమునకు రూపకల్పన జరిగింది. ఆ స్ఫూర్తిని 'చాలా శాబ్దికమైన చమత్కారంతో ఈ కవి ఇందులో నిక్షేపించాడు 'నీరూపతతులు' – నిర్+రూప–నీరూప అవుతుంది. తతులు నీ, రూపానికి సంబంధించినవి. చక్కని సమాసకల్పన! చక్కని ప్రయోగం.

ఈ కవిని మనసారా అభినందిస్తున్నాను.

**డా॥ శలాక రఘునాథ శర్మ**



విద్వత్కవీంద్రులు, ప్రఖ్యాతవ్యాఖ్యాత
**ఆచార్య బేతవోలు రామబ్రహ్మం**
తెలుగు శాఖాధ్యక్షులు
కేంద్రీయ విశ్వవిద్యాలయం
హైదరాబాద్.

# పుష్పయాగం

క్షణం తీరిక ఉండని ప్రభుత్వోద్యోగాలు చేస్తున్నా పద్య రచనని వదలకుండా సాగిస్తున్న దీక్షా కంకణబద్ధుడు కవితాప్రసాదుగారు. ఇది అభినందించవలసిన విషయం. అస్మదాదులు ఆత్మపరిశీలన చేసుకోవలసిన విషయం కూడా. ఇటీవల వీరు పద్నాలుగు నెలపాటు ఏడుకొండలవాడి సేవలో ఉన్నారు. ఇది నిజంగా పూర్వజన్మ సుకృతం. దూరంనుంచి చూసేవాళ్లం కనక మనకి ఇలాగే అనిపిస్తుంది. సరే. స్వామి వారిని నిత్యమూ దర్శించుకుంటున్న వీరిలో –

"తనువు తనువంత నీ గుడి తలుపుజేసి
ఎదురు చూచెద వాకిలి వదలకుండ"

అన్నంతగ అనన్యభక్తి గాఢంగా కుదురుకొంది. కుదురుకున్న భక్తి కుదురుగా ఉండనిస్తుందా! శతకరచనకు తలుపులు తీసింది. అది సీసపద్యాల శతకమయ్యింది. ఎత్తుగీతిలో చివరి రెండు పాదాల్నీ మకుటంగా కూర్చడం సీసపద్యాల శతకరచనకు ఒక సంప్రదాయం. అద్భుతమైన మకుటం దొరికింది. కవియుగప్రత్యక్ష దైవానికి వజ్రకిరీటం లాంటి మకుటం, అంత్యానుప్రాసతో తళత్తళలాడిపోతూ రూపుదిద్దుకుంది. వేంకటేశ్వరుడు ఏనాటికీ తరగని కవితానిధి. ఆత్మ విష్కరణకూ ఆర్తి ప్రకటనకూ అధిక్షేపానికీ అనాచరదూషణకూ అభిజ్ఞత నివేదనకూ – ఒకటేమిటి అన్నింటికీ

అవకాశమిచ్చే కావ్యవస్తువు. ఇంకేమిా! కవితాప్రసాదు గారు విజృంభించారు.

భక్తిశతకాల్లో సాధారణంగా పాఠకులు ఆశించేదీ, ఆస్వాదించేదీ, అకృత్రిమంగా జరిగే ఆత్మనివేదన. బుద్ధికి పదునుపెట్టే కల్పనలూ ఉత్ప్రేక్షలూ ఉండవని కాదు, ఉండకూడదనీ కాదు. కానీ పాఠకుడికి కవితోనూ, దైవంతోనూ, తాదాత్మ్యాన్ని కలిగించేది ఆర్తి. ప్రకటనమూ ఆత్మనివేదనమును. ఇదే భక్తిశతకాలలోని పద్యాలను చిరంజీవులు చేసే జీవధాతువు – ప్రాణశక్తి. ఈ శతకంలో ఈ దినుసు పద్యాలదే సింహభాగం. "ఇది స్వార్థమనుకొనుము ..... "కొత్తదేహము లేమి ..... "పడవతీరము వీడి ..... "అందదగిన సాయ మందుట లేదేల ..... "ప్రణయబీజాంకుర ..... "పూలబాటగనెంచి ..... "ముళ్ళబాటనుబట్టి ..... "కంటగ్రాములపై కదలుచుంటి ..... "పథము విధమును లేని పుష్పంధయుండ మంత్ర పుష్పమ్ముగా నన్ను మార్చుమయ్య ..... "పూర్తిగా మనుగుకముందె ..... "శృంగారసిద్ధికై ..... "పచ్చపచ్చని కొండ ..... "తరుల రహసనమ్ము ..... "కాంతివేగము ..... "గగనతత్త్వమ్ము ..... "బ్రహ్మమొక్కటి యంచు ..... "అమ్మయౌ వకుళమ్ము వేలగుండెలు మిాటు జాలిపాటల పిట్ట ..... "వ్యక్తులతోడి సంబంధమ్ము – "దండిపుమా నన్ను ..... "నూరుపద్యమ్ములు ..... "చూపొక్కటేచాలు ..." "కులరాహు కబళనన్ ..... "కాలిబాటనుసాగి ..... "కృతంబునంబున ధర్మకృతులకు ..... "పాడుకొమ్మా నన్ను ....."

ఇలా ఉదహరించుకుంటూ పోతే యాభై అరవై పద్యాల దాకా వెడుతుంది ఈ లెక్క.

అసలింతికీ తన రచనను పాఠకులు ఎలా చూడాలనుకుంటున్నాడు ఈ కవి? ఎక్కడో ఒక తాళంచెవి దాచిపెడతాడు ప్రతికవీ. "ప్రత్యక్షమైనట్టి ప్రతి భావదృశ్యమ్ము ప్రత్యక్షరములోన ప్రతిఫలింప –" అనే పద్యమే పెద్ద తాళంచెవి. భావచిత్రాలు, నూతనానుభూతులు, నూతనానుభవాలు, మార్మిక



సద్భావ లహరులు, యోగదీక్షలు – వీటిమిాద దృష్టిపెట్టండి అంటున్నాడు ఈ కవి. వీటిలో మొదటివి రెండూ కవిత్వానికి ముడిపదార్థాలు. సమవాయ కారణలు. కాబట్టి వాటిగురించి అన్వేషణ – అనుశీలన అవసరం లేదు. మూడవది నూతన భావావిష్కరణ. భక్తికవిత్వానిది వేల సంవత్సరాల చరిత్ర. ఇంత సుదీర్ఘ సువిస్తర కవితాశాఖలో నూతన భావావిష్కరణ అసంభవ మన్నంత కష్టసాధ్యం. శంకరభగవత్పాదులనుంచి, జాషువా వరకూ అద్వైతసిద్ధి నుంచి అంతర్యజ్ఞం వరకూ, ఎన్నో అనుసరణలు వీరి పద్యాల్లో రవళించినా, ఓం ప్రథమంగా వీరే ప్రవేశపెట్టిన నూతనభావచారిమలూ చాలానే ఉన్నాయి. ఇదీ విశేషం. "పూలపడగలు విప్పి ..... "శూన్య సరస్సులో ..... "భూలోకమున ..... "ప్రాణావృతోచ్ఛలత్ ..... "పరిధి వ్యాసములేని ..... "ఒక మహావిస్ఫోటనకు ..... "తలపులన్నియు వక్రతమములే ..... "హిమవన్నగచరిత్ర ..... "మేఘాలపలకపై ..... "తనమేనికాంతి ..... "తీగ ఊయలపైన ..... "ప్రాణసమీరము ..... "తల్లి గర్భములోన ..... "మనసు ధ్యానమ్మున ....."

వీటితోపాటు, వీరికున్న గణితశాస్త్ర పరిజ్ఞానంతో ఆవిర్భవించిన మరో రెండు మూడు పద్యాలూ – ఇవన్నీ వీరు దృష్టిసారించమన్న స్వీయకవితా లక్షణాలలో చివరమూడింటికీ నిక్కచ్చిగా నిలిచే నిదర్శనాలు. చిరస్థాయిగా నిలిచే శిలాశాసనాలు.

విస్తరభీతిలో సూత్రప్రాయంగా నాకు తోచిన నాలుగు ముక్కలు పలికాను. ఇదొక సంతృప్తి. ఏమైనా తెలుగు శతక కవితాశాఖకు కొత్త పూలు పూయించి స్వామికి సమర్పించిన ఈ కవితా వైజ్ఞానికుణ్ని మనసారా అభినందిస్తూ సహృదయులకు స్వాగతం పలుకుతున్నాను. సెలవు.

భవదీయుడు

వికృతి – సంక్రాంతి

**బేతవోలు రాంబ్రహ్మం**

**Dr. K.V. Ramanachary**, I.A.S.,
Prl. Secretary to Government
(Endowments).

Revenue Department,
Room No. 516, 5th Floor, L-Block,
A.P. Secretariat,
Hyderabad - 500 022,
Office Tel. No. 040-23450160

# నా'నుడి'

మిత్రులు, ఆత్మీయులు డాక్టర్ రాళ్లబండి కవితాప్రసాద్ అవధాన విద్యావధాని. పద్యం ఆయనకొక ధార. "సుగమ ముదాత్త భావనల శోభనమై రసమండితమ్ముగన్ సొగసుల ..." పద్యమన్న ఆయనకు ప్రీతి. కవితాసక్తి మెండు. సంప్రదాయజ్ఞులు. సతత సరస్వతీ సముపాసకులు. కవితాసక్తితో బాటు, దేవీ భక్తి ఆయనకు తోడు. జగన్మాత కదంబకుసుమ ప్రియ, వీరిలోని కవితా శాఖలను కదిలించి, 'త్రిపుర సుందరి మాకు ప్రసన్న మయ్యెడిన్' అనే మకుటంతో అష్టోత్తర శత పద్య ప్రసూనాలను జల జల రాల్చింది. రమణీయ శిల్ప కల్పనాత్మకంగా, మంత్ర శాస్త్రవిశేష సముల్ల సితంగా ప్రభవించిన ఆ కావ్యమే **'కాదంబిని'**. దేవీ భక్తుడైన శ్రీ రాళ్లబండి కలియుగ సార్వభౌముడగు సప్తగిరిధాముని సన్నిధిలో భాగవోత్తములకు, భక్తజనసందోహానికి సేవ చేసుకొనే భాగ్యాన్ని పొందిన తరుణంలో తాత్త్వికత, భక్తి తత్పరత, సామాజిక స్పృహ, వేదన, ఆత్మ నివేదన, అభివ్యక్తిరమ్యత కలబోసుకున్న కావ్యంగా 'సప్తగిరిధామ! కలియుగ సార్వభౌమ!' యన్న మకుటంతో భక్తి, నీతి జమిలిగా ఉన్న మరో శతకాన్ని **సప్తగిరిధాముని** పేరిట సాహితీలోకానికి అందిస్తున్నారు. తను ఒక అధికారి అయ్యూ, 'అధికార వర్గంపు అనుబంధమున కన్న అర్చక సమితి స్నేహంబు మిన్న' యని భావించినవారు కవితాప్రసాద్.

**'శంకదీర్చెడు అవిభాజ్య సంఖ్య స్వామి**
**అంకెకేరాని శూన్యపూర్ణాంక మేను ...'**



తిరుమలేశుని ప్రణవసుమదాముడిగా సంభావించి, అవిభాజ్య సంఖ్యగా ఊహించి, శూన్య పూర్ణాంకంగా తన్ను తాను సంబోధించుకోవడ మిక్కడ అద్భుత విశేషం.

కరీంనగర్ జిల్లా ధర్మపురి నివాసి శ్రీ శేషప్ప కవి తమ నరసింహ శతకంలో –

'అధిక విద్యావంతుల ప్రయోజకులైరి
పూర్ణశుంఠలు సభాపూజ్యులైరి .....
దుష్టమానవులు వర్ధిష్ణులైరి' యని పేర్కొన్న ఛాయల్లోనే –
డాక్టర్ రాళ్లబండి కవితా ప్రసాద్ –
ప్రతిభా ప్రభల గాంచి పరవశించుట మాని
కులపుటారాల్ దీసి కులకువారు
సౌందర్యమును గాంచి స్పందించుటలు మాని
చిల్లర వేషాల చెలగువారు
నీతిమంతుల గాంచి ఖ్యాతి చెప్పుట మాని
లోతుపాతుల నెంచు జాతివారు
ధ్యానయోగుల గాంచి దరిజేరుటయు మాని
కొంగ జపమ్మని కూయువారు
ఉన్నతంబగు స్థానాల నుండిరేని

వారి నిర్ణయంబులె అనివార్యమయ్య ...' యని అస్తవ్యస్తమైన ఈనాటి వ్యవస్థలోని దురవస్థను కళ్లకు కట్టినట్లు కవిత్వీకరించినారు.

గబ్బిలాలయింటికి కపోతాలు వినతి పత్రాలతో వెళ్తున్నట్లు –
కాకుల గోలను కోకిలలే మెచ్చి సన్మాన పత్రాలు చదివినట్లు –
ఊరకుక్కల సభకు ఐరావతాలుకాపలాదారులన్నట్లు –
కాగితపు పూదండలే కావాలనుకున్న వాళ్లున్నప్పుడు –
మల్లెలు మౌనముద్ర వహించినట్లు –

పదవి కల్లు త్రాగి పిచ్చెక్కిమదము పట్టిన కోతి కొలువున విజ్ఞులెంత కుమిలిపోతుంటారో – మనోజ్ఞంగా వర్ణించారు.

ఈ రోజుల్లో నోటితో మాట్లాడి నొసటితో వెక్కిరించేవారి సంఖ్య ఎక్కువైంది. అందుకే 'ఆత్మీయత లేని అభినందన చేద'న్నారు కవి.

'పంచభూత ప్రశాసక ప్రభుడవీవు.
పాంచ భౌతిక దేహాన బంది నేను .....'

'మాయలన్నియు మాయ,
మాయగానిది మాయ
మాయలోపలి మాయ
మాయ మాయ .....'
ద్వంద్వ మాయల చిక్కిన
తగులమేను
ద్వంద్వమును బాపునట్టి
అద్వంద్వమీవని పరమ భాగవతోత్తమలుగా, తమ ఆర్తిని, ఆవేదనను, సంప్రదాయజ్ఞతను, తాత్త్వికతను చాటుకున్నారు కవితాప్రసాద్.

'అనుకూలవతిగాని యర్ధాంగికన్నను,
పక్కలో నిదుకున్న పాముమేలు
అనుమానమున వేగు పెనిమిటికన్నను,
గపడ గాండ్రించు వ్యాఘ్రమ్ము మేలు
సహకరించనియట్టి జ్ఞాతులకన్నను,
కాటగాచెడు జంబుకంబు మేలు
ధిక్కరించెడిదుష్టుడొక్క పుత్రునికన్న,
నెత్తిపై వేలాడు కత్తిమేలు
ఇట్టి బంధాలనడుమన కొట్టుకొనెడి
యట్టి జనులను కాపాడుదిట్ట వీవు ...



ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట మనమందరం పైన పేర్కొనబడిన రీతిలో సంసారసాగరబంధంలో కొట్టుమిట్టాడే వాళ్లమే. సర్వసామాన్యంగా, స్వాభావికంగా, అతిసహజంగా నిత్యజీవితంలోని సంఘర్షణల మధ్య నలిగే చరాచర జీవులను అనునిత్యం కాపాడేవాడు ఆ సర్వేశ్వరుడేయన్న సామాజిక సత్యాన్ని తెలిపినారు.

అమ్మాయౌవకుళమ్మ 'అజమాయిషీ' లేక
ప్రొద్దుట నీకింత ముద్దలేదు
భార్య లక్ష్మమ్మయే భక్తుల కరుణింప
కున్నచో గుడిహుండి యునికి లేదు
తల్లి పెండ్లాము బిడ్డల దయను లేక
కూతురు గంగమ్మ కొలను నింపకయున్న
తిరుతీర్థమున కింత దిక్కులేదు
కొడుకు బ్రహ్మయ్యయ్యే కూడిరాకున్నను
ఉత్సవాలన్నట్టి ఊసులేదు
రోజు గడువదు నీకు సరోజనేత్ర! .... యని పేర్కొన్న పద్యం, 18వ శతాబ్దికి చెందిన దివిసీమవాసి శ్రీ ఆంధ్ర నాయక శతక కర్త శ్రీ కాసుల పురుషోత్తమకవి రచించిన –

ఆలు నిర్వాహకురాలు భూదేవియై
అఖిలభారకుడను నాఖ్యతెచ్చె;
ఇష్ట సంపన్నురాలు ఇందిర భార్యయై
కామితార్థకుడన్న ఘనతతెచ్చె;
కమలగర్భుడు సృష్టి కర్తతనూజుడై
బహుకుటుంబికుడన్న బలిమితెచ్చె;
కలుష విధ్వంసిని గంగ కుమారియై
పతిత పావనుడన్న ప్రఖ్యాతి తెచ్చె

ఆంధ్రు బిడ్డలు తెచ్చు
ప్రఖ్యాతిగాని
మొదటినుండియు నీవు
దామోదరుడవె ...' యన్న పద్యాన్ని స్ఫురింపచేస్తున్నది. తల్లి అజమాయిషీ, భార్య కరుణ, పిల్లల సహకారం వల్లనే స్వామి నిత్యకల్యాణ చక్రవర్తిగా విరాజిల్లుతున్నాడు గాని, స్వయంగా స్వామి ఏమీ చేతగానివాడనే నిందాస్తుతి రూపంలో ఈ పద్యం రూపొందింది.

శ్రీ రాళ్లబండి ఏడు కొండలవాడికొండను పసిడికాంతుల కొండ యన్నారు. ఆర్తుల హృదయాల కండదండని కీర్తించారు. 'సురలు తిరుగు కొండ; ఝరులు పారెడు కొండని' పొగిడినారు. నిఖిలామృతంబులు నిండిన కొండగా' అభివర్ణించారు. 'శక్తినిచ్చెడు కొండ; భుక్తినిచ్చెడు కొండ'; 'మ్రొక్కినంతన ఫలియించు మోక్షకాండయనీ' పచ్చపచ్చని కొండయైన వేంకటాద్రి సౌందర్యాన్ని ఇంత సుందరంగా తీర్చిదిద్దిన సుకవి ఇటీవలి కాలంలో నాకంటపడలేదు.

'భయపెట్టెదవు నీవు, బాద పెట్టెదవీవు
కన్నీటి సంద్రాన కలిపెదీవు
....... ....... .......
....... ....... .......
నవ్వించెదవు నీవు, కవ్వించెదవు నీవు
మోహవార్థిని పుట్టి ముంచెదీవె
అందమిచ్చెదవీవు, హరియించెదవునీవని ...' శ్రీ వేంకటేశ్వరుని స్తుతించిన తీరులో సామాన్యుడికి 'దేవత' చిత్రంలోని 'బొమ్మను చేసీ .. ప్రాణం పోసీ ...' యన్న శ్రీశ్రీ రచనలోని సొరుహోరు ధ్వనిస్తూంది.

ఒంటిగానైతి, అలసిపోయితి, విసిగితి,
ఆగిపోతి, నీ యొడి నొదిగిపోతినంటూ అన్నమయ్యలా 'సకల



బలంబులు నీవె సర్వేశ్వరా' యని ఆదేవదేవుని వేడుకొన్నారు కవితా ప్రసాద్ మరో పద్యంలో.

ఇలాంటి మరెన్నో గొప్ప పద్యాలు ఈ శతకం నిండా ఉన్నాయి. చమత్కార చాతుర్యాలతో, వ్యాజోక్తులతో, సామాజిక సూక్తులతో సాగిన ఈ శతకంలోని ప్రతి పద్యమూ మాధుర్యగుణ సంపన్నమై అలరారుతుంది. ఒక్కో పద్యం ఒక్కో రసగుళిక.

సప్తగిరిధాముని సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులైనారు కాబట్టే డాక్టర్ రాళ్లబండి కవితాప్రసాద్ ఈ శతకాన్ని సారస్వత లోకానికి ఈ రీతిలో అందించగల్గుతున్నారనేది నా విశ్వాసం.

ఆ ఏడుగట్లతేడు ఎల్లప్పుడూ వీరిని చల్లగా చూడాలని ఆశిస్తూ –

శుభాకాంక్షలతో-



(డా. కె.వి. రమణాచారి)

# అవభృధవేళ ...

పద్య రచన ఒక యజ్ఞం. ఆ యజ్ఞం పూర్తి అయినవేళయే అవభృధవేళ. 'ఒక శతకాన్ని వ్రాయడం అంటే' కవి తన 'ఆర్తి'ని తీర్చుకోవడం. సమూహంలో అనుభవించే ఒంటరితనాన్ని వదిలించుకోవడం. తోడు కోసం దేవుణ్ణో, తననో, మరొకరినో దరిచేరి, తనలో సంచలించే మానసిక రసాయనిక చర్యల్లో పుట్టే నవజాత ఆవేశాగ్ని (latent emotional fire)ని చల్లార్చుకోవడం. 'సప్తగిరిధామ, కలియుగసార్వభౌమ' శతక నేపథ్యమూ అదే ...

2009 అక్టోబరు 3వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానంలో 'ధర్మ ప్రచారపరిషత్తు' కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాను. అక్కడ చేరడం ఒక మిశ్రమానుభవాల సంకలనం. నేను ఆ బాధ్యతలు స్వీకరించడానికి కారణం 'జీవునివేదన' సగం. మిగతాసగం శ్రీ ఐ.వై.ఆర్.రామకృష్ణారావు ఐ.ఎ.ఎస్. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, టి.టి.డి. ఆయన ఒక అత్యున్నతస్థాయి పరిపాలనా ప్రజ్ఞకు రూపం. శ్రీ ఐ.వై.ఆర్. గారు ధర్మకార్యాల పట్ల రాముడు, అధర్మకార్యాల పట్ల పరశురాముడు. ఇక ధర్మప్రచార పరిషత్ ఆయన ప్రథమ ప్రాధాన్యం. అందుకే నా ఉద్యోగపర్వం పర్వంగా సాగింది.

ఈ.వో. (టి.టి.డి) అంటే సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రథమ సేవకులు. స్వామివారే ఆయనతో చెప్పి అన్ని పనులు చేయిస్తారు. ఈ.వో. గారి ఉత్తర్వులన్నీ స్వామివారి ఉత్తర్వులే. అలా స్వామి వారి కొలువులో ధర్మ సేవకునిగా చేరాను. 2010 డిసెంబరు 1 వరకు పనిచేశాను. ఈ పధ్నాలుగు నెలలలో స్వామికి నాకు మధ్య ఎంతో నడిచింది. నన్నెందుకు పిలిపించుకున్నారో తొలిక్షణంలోనే అర్థమైంది. అధికారిగా బాధ్యతలన్నింటినీ ఈ.వో. శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావు గారు సమర్థంగా నాతో చేయించారు. స్వామి వారు నన్ను కవిగా ఏం చేయాలో స్ఫురింపజేశారు. ఆ స్ఫురణలు అనేకం. ఆ సంస్ఫురణల్లో ఈ శతకం ఒకటి.



సార్వకాలీనమైన ధర్మం, సమకాలీనమైన ధర్మం, రెంటి మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు, జరిగే పరిణామాలకు దర్పణమే ప్రపంచీకరణ. దానివల్లనే, మనిషిని ఆధ్యాత్మికంగా సమున్నతంగా చేర్చాలిన ధర్మం, మసక బడింది. ఆ మసకలే మతాలు, వాదాలు, గొడవలు.

దేనివల్ల మనిషిని నాగరికుడు అవుతాడు అని ప్రశ్నవేసుకుంటే, ధనం వల్లకాదు - పదవివల్ల కాదు - కవిత్వం వల్ల కాదు - కళలవల్లకాదు - కంప్యూటర్ల వల్లకాదు - ప్రయోగాలవల్ల కాదు - inventions and discoveries వల్ల కాదు - కేవలం ధర్మాచరణవల్ల మాత్రమే మనిషి నాగరికుడౌతాడు. ఏ వృత్తిలో ఉన్నా అంతస్సూత్రంగా ధర్మం మనిషిలో ప్రవహిస్తూంటే అతడే నాగరికుడు. ఆ వృత్తే ధర్మం.

ఆ అంతస్సూత్రం తెగిపోతే మనిషి అనాగరికుడే.

మరి, ఏది ధర్మం? ఏది అధర్మం? అనే ప్రశ్న వేసుకుని అన్వేషణ చేస్తోంటే పుట్టిన పద్యాలు ఈ శతక పద్యాలు. 'కలియుగ' శబ్దాన్ని సార్థకంగానే వాడాను.

ఈ యుగంలో అనంత శక్తిమంతుడు శ్రీ వేంకటేశ్వర స్వామి వారు. ఆయనతోనే చెప్పుకున్నాను. చెప్పుకున్న అన్నింటినీ పద్యాలుగా విప్పుకోలేదు. పద్యాలుగా వ్రాసిన అన్నింటినీ ప్రచురించడం లేదుకూడా. ప్రస్తుతమైన పద్యాలే మీ ముందున్నాయి.

ఈ పద్యాలు కొండ ఎక్కుతూ వ్రాసినవి కొన్ని - కొండదిగుతూ వ్రాసినవి కొన్ని - కొలువులో వ్రాసినవి కొన్ని - కోవెలలో వ్రాసినవి కొన్ని - విషాద బాష్పాలతో వ్రాసినవి కొన్ని - ఆనందాశ్రువులతో వ్రాసినవి కొన్ని.

ఈ పద్యాలు వ్రాయకుండా ఉండలేని ఒకానొక ఉద్విగ్న మానసిక స్థితిలో వ్రాసినవి. ఇవి ఇప్పటి ధార్మికభావుక హృదయాల వేదనా శోధనలకు అనునాదంగా ఉండాలని వ్రాసినవి. ఇంతకన్నా నేపథ్యాన్ని చెప్పలేను.

ఈ పద్యాలు ఎందరో సహృదయులు విన్నారు. 'ప్రచురించండి' అని స్నేహపూర్వకంగా ఆదేశించారు. ముద్రణకు స్వచ్ఛందంగా స్వామి వారిపై అచంచల విశ్వాసం గల ప్రవాస భారతీయులు (NRI) **డా॥ పేర్ని వీరయ్య చౌదరి డా॥ స్వరాజ్యలక్ష్మి దంపతులు** ముందుకు వచ్చారు. వారిది గుంటూరు జిల్లా, ఇడుపులపాడు. గత 35 ఏళ్ళుకు పైగా అమెరికాలో ఒహాయ్ ప్రాంతంలో ఉంటూ, తెలుగు సంస్కృతిని, భారతీయ ధర్మాన్ని ఆచరిస్తున్న పుణ్యమూర్తులు. వాళ్లదంతా వైద్యవంశమే. కొడుకులు, కోడళ్లు, అల్లుల్లు అందరూ సద్గుణ సంపన్నులే.

వీరితో నాకు అనుబంధాన్ని కల్పించింది, ప్రఖ్యాత నాట్యాకళా విశారదుడు శ్రీ కె.వి. సత్యనారాయణ గారు. భారతదేశంలోనే కూచిపూడి సంప్రదాయ నృత్యంలో అగ్రేసర నాట్యాచార్యులు. ఒక్కరోజులో సరిగ్గా 24 గంటల్లో, నాచే నృత్యరూపకం రాయించి, సంగీతాన్ని కూర్చి, నృత్యానికి దర్శకత్వం వహించి, 56 మంది నర్తకులతో, రవీంద్రభారతి హైదరాబాదు 2008లో, 'పంచకన్య' నృత్యరూపకాన్ని ప్రదర్శించి అందరిచే సెభాస్ అనిపించుకున్న సృజనా శక్తిసంపన్నులు. 'ఆముక్తమాల్యద' నృత్యరూపకం సృష్టించి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించారు. కాలార్చన, పంచకావ్య వంటి సాహిత్య, సౌందర్య, సంగీత భరితమైన, సానలు తీరిన జాతిరత్నాల వంటి నృత్యరూపకాలకు దర్శకత్వం వహించి శతాధిక ప్రదర్శనలిచ్చారు. ఇవన్నీ నా రచనలు కావడం నా అదృష్టం.

వారు ఈ శతక ప్రచురణలో ప్రతిక్షణం కృషి చేశారు.

ఈ సందర్భంగా డా॥ వీరయ్య చౌదరి, డా॥ స్వరాజ్యలక్ష్మి దంపతులకు, వారి కుటుంబానికి, శ్రీ కె.వి. సత్యనారాయణ గారికి, స్వామి వారి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని ఏడుకొండల స్వామిని ప్రార్థిస్తున్నాను.

డా॥ శలాక రఘునాథశర్మ గారు రూపెత్తిన భారతీయ ధర్మం. ఈ



శతకాన్ని పరిష్కరించడం మాత్రమే కాక ప్రత్యక్షర సుందరమైన పీఠిక వెలయించి నన్ను ఆశీర్వదించారు. వారికి నమోవాకాలు.

ఈ శతక కావ్యానుశీలనం చేసిన విద్వత్ కవీంద్రులు, ప్రఖ్యాత వాఖ్యాత డా॥ బేతవోలు రామబ్రహ్మంగారు. ముందుమాటకు **'పుష్పయాగం'** అనే పేరు పెట్టారు. ఆ నామకరణం చాలు, ఈ శతక మార్దవాన్ని, దాని వెనుక గల పవిత్రతను గుర్తుపట్టడానికి. శతక హృదయాన్ని పట్టుకొని మీకు పరిచయం చేశారు. వారికి శిరస్సువంచి నమస్కరిస్తున్నాను.

డా॥ కె.వి. రమణాచారి ఐ.ఎ.ఎస్. గారు పద్యకావ్యాలపై ఉస్మానియాలో సాధికారికమైన పరిశోధన చేసి, ఒక చారిత్రాత్మక అవసరాన్ని తీర్చిన ప్రజ్ఞాసమన్వితులు. ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ) హోదాలో ఉన్న డా॥ రమణాచారిగారు తెలుగు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దదిక్కు. వీరు ఈశతకాన్ని కొత్తకోణంలో అనుశీలించారు. వారి 'నుడి'కి నమస్సుమనస్సులు.

ఆచార్య సర్వోత్తమరావు గారు, మిత్రుడు శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు పద్యరచనా కాలంలో ఆత్మీయ చర్చలకు ఆలంబనలు. వారికి సాధువాదాలు.

స్వామివారి శతకం మీ కరకమలాలలో ఉంది. ఇక ఈ పద్యాలు మీవే. వీటి పఠన, పాఠన, చర్చా, ధారణ, అధ్యయన, అధ్యాపనాల వల్ల లభించే స్వామి వారి ఆశీస్సులన్నీ మీకే ....

శతక రచనా యజ్ఞాన్ని పూర్తి చేసిన ఈ అవభృధవేళ, అరమోడ్పు కన్నులతో, అందరికీ అంజలి ఘటిస్తూ ...

హైదరాబాద్
23-1-2011

**డా. రాళ్లబండి కవితాప్రసాద్**

ఓం

## నమో వేంకటేశాయ

శ్రీమాతృచిత్కళాశ్రీవత్సలాంఛన
    ద్యుతిమణిదీప్వప్రయోగసిద్ధి
శ్రీచక్రబిందుకేంద్రీయసుదర్శన
    చక్రవిభ్రమణప్రసారశక్తి
శ్రీంకారనాదవిస్తృతతరంగావృత
    శంఖానునాదప్రచండగరిమ
శ్రీపీఠసంస్థితసితపద్మసమపాద
    సందీప్తదివ్యప్రశస్తశోభ.

కలసి తిరుమంత్రరూపమై వెలసితీవ!
వైభవోద్దామ! శ్రీదాసవార్ధిసోమ!
ప్రణవసుమదామ! నిగమపరాగసీమ!
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ! 1

సురలతేరుల గిరుల్, విరులుపూచిన తరుల్,
    ఝరులు పొంగిన దరుల్ మెరయుచోటు
ఫణులకన్నుల మణుల్, మణుల వెన్నెల వనుల్,
    వనుల తిన్నెల జనుల్ బరగుచోటు
శిలలగానమ్ములున్ కలలమౌనమ్ములున్
    అలలవేదమ్ములున్ పలుకుచోటు
చలితసద్విజతతుల్ సాధుసద్విజనుతుల్,
    లలితసద్విజగతుల్ వెలయుచోటు.

అరయు మిచ్చోటు! భూనభోంతరమునందు
పోల్పనిట్టిది లేదు సంపూర్ణ మిద్ది
ప్రణవసుమదామ! నిగమపరాగసీమ!
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ! 2

పరిసర సంస్కార పరిణాహ భూమికన్
భావసుమమ్మొండు పరిమళించు,
పరిమళించిన దివ్య భావలతాంతంబు
లాలోచనమ్ములై యవతరించు,
అవతరించిన యట్టి ఆలోచనద్యుతుల్
అక్షరాకృతి దాల్చి అనుసరించు,
అనుసరించెడి శబ్దమాహ్లాదమౌపద్య
వాణీస్వరూపమై ప్రతిఫలించు.

ప్రతిఫలించిన పూలు నీ పాదమంటు,
పాదమంటిన ప్రతిపూవు ప్రణవమౌను!
ప్రణవసుమదామ! నిగమపరాగసీమ
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ!





ప్రత్యక్షమైనట్టి ప్రతిభావదృశ్యమ్ము
ప్రత్యక్షరములోన ప్రతిఫలింప
అనుభవించిన కొత్తఅనుభూతి అక్షర
ప్రభ రసాకృతి తాల్చి పరిమళింప
గుండెలోపల పొంగు కొంగ్రొత్తభావనల్
పద్యపాఠమ్ములై పరుగులెత్త
మనసున మొదలైన మార్మికసద్భావ
లహరులు కవితలై లాస్యమాడ

శ్వాసయంతయు యోగమై సాగునట్లు
దీక్ష గైకొంటి, గుట్టును తెలిసికొంటి
ప్రణవసుమదామ! నిగమపరాగసీమ!
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ!

వాంఛాగ్నికీలలన్బడి, కాలభూమిపై
రాలు జీవనభస్మరాశులొకట
సిరులపూవులవాల గరళమరందముల్
గ్రోలితూలెడు తేటికులము లొకట
పగల రక్కెసకంప తగిలి మానసహంస
క్రేంకియారవరక్త గీతులొకట
పదవీమదోన్మత్త పంజరసామ్రాజ్య
భ్రమమగ్నరాజకీరములొకంట

తత్త్వమును బాసి, బ్రతుకున దారితప్పి
శిథిలమౌ జాతి నీవె రక్షింపవలయు
ప్రణవసుమదామ! నిగమపరాగసీమ!
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ!





పూపడగలు విప్పి బుస్సున లేచెడి
తీగనాగముల పందిళ్లనడుమ
విస్ఫోటనారంభ వికటరశ్మ్యుద్గార
ఫలయుత విషపాదపముల నడుమ
రక్తజిహ్వోన్ముక్త ప్రతిరావగతివేగ
ధూర్తకిరాత జంతువుల నడుమ
ధరకు జారెడి ధరాధరశీర్షసంజాత
గరళిత జలపాతగముల నడుమ

తపము నొనరించు హంసహృదంతరముల
రావమై వెల్గు తిరుమంత్రరాజ మీవు
ప్రణవసుమదామ! నిగమపరాగసీమ!
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ!

కొండకు వినిపింతు గుండెగోడంతయు
గుండెగల్గినతండ్రి కొండ గనుక
చెట్టుకు వినిపింతు గుట్టైన మనసును
మనసున్న మాతల్లి మ్రాను గనుక
పూవుకు వినిపింతు పూజలో నాఆర్తి
ఆర్తి మాన్పెడు చెల్లి అలరుగనుక
ఏటికి వినిపింతు ఎదదకన్నీటిని
వదలని చెలికాడు వాగు కనుక

అవియునైనను నాబాధ లాలకించు
నీవు మాటాడకూరకే నిలచితేల?
ప్రణవసుమదామ! నిగమపరాగసీమ!
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ!





పరిసేవితకిరీటి! పాలితవైరాటి!
అసురఘ్నధాటి! ధీయజ్ఞవాటి!
గోపీజనవిరాళి! గోపికాహృత్కేళి!
కారుణ్యహేరాళి! కనకపాళి!
దాసాత్మసంచారి! రాసకేళివిహారి!
చపలదుర్జనహారి! చక్రధారి!
వైఖానసస్ఫూర్తి! వరతిరుమణిమూర్తి!
అరిజనసమవర్తి! అఖిలకీర్తి!

ప్రణవపరిణామ! ధరణిజాప్రణయవామ!
ప్రథితవిక్రమసంగ్రామ! ప్రణుతసోమ!
ప్రణవసుమదామ! నిగమపరాగసీమ!
సప్తగిరిధామ! కలియుగసార్వభౌమ!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=395**